విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి



తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని మా భవిష్యత్తు కోసం కష్టపడి వైద్య విద్య చదివిస్తున్నారు. సుదూరప్రాంతాల నుంచి వచ్చి పీజీలలో చేరి చదువుతున్నాం. కానీ కోల్‌కతా లాంటి ఘటనలు మానసిక ఆందోళనకు గురిచేస్తున్నాయి. విద్యపై ప్రభావం చూపుతాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వం విద్యార్థులతో పాటు తల్లిదండ్రులలో ఆత్మవిశ్వాసం నింపాలి.

-ఐ.నిఖితా రెడ్డి, ఎయిమ్స్ విద్యార్థిని



కోల్‌కతా ఘటన ఆందోళనకు గురిచేసింది



కోల్‌కతాలో చోటుచేసుకున్న ఘటనతో వైద్య విద్యార్థులను ఆందోళనకు గురిచేసింది. ఘటనను వైద్య విద్యార్థినులు మాత్రమే కాకుండా మహిళా లోకంపై దాడి. దేశంలోని అందరూ ఖండించాలి. మహిళలు అన్న రంగాల్లో రాణిస్తున్నారు. అయినా ప్రభుత్వం ఉదాసీనత కారణంగానే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి. లేకుంటే మహిళలకు మానసిక ధైర్యం కోల్పోయే ప్రమాదం ఉంది.

-ఎం.అంజిని, విద్యార్థిని

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్‌లో చంద్రికకు పతకాలు



మంగళగిరి: పవర్ లిఫ్టింగ్ పోటీలలో చంద్రిక ప్రతిభ చూపింది. ఈ నెల 20వ తేదీ నుంచి 25వ కోల్‌కతాలో నిర్వహిస్తున్న సీనియర్ నేషనల్ పోటీలు నిర్వహించారు. శనివారం పోటీలతో మహిళల 84 కేజీల విభాగంలో మంగళగిరి నుంచి బొల్లినేని చంద్రిక ఓవరాల్ బ్రాంజ్ మెడల్ ఇంటర్‌స్టేట్ సిల్వర్ మెడల్ సాధించినట్లు అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మాకుల విజయభాస్కరావు, కోచ్ షేక్ సంధానిలు తెలిపారు. స్క్వాట్ 250 కేజీలలో సిల్వర్ మెడల్ బెంచ్ ప్రెస్ 110 కేజీలు, డెడ్ లిఫ్ట్ 180 కేజీలు బ్రాంజ్ మెడల్, ఓవరాల్ 547 కేజీలు బ్రాంజ్ మెడల్ ఇంటర్ స్టేట్ సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన చంద్రికను అసోషియేషన్ ప్రతినిధులు అభినందించారు.

పంట నమోదు తప్పని సరి



తాడేపల్లిరూరల్: రైతులందరూ తప్పని సరిగా పంట నమోదు చేయించుకోవాలని దుగ్గిరాల వ్యవసాయ అధికారిణి పి.శిరీష అన్నారు. శనివారం దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పంట నమోదు ద్వారా పంట నష్ట పరిహారం, సున్నా వడ్డీ పథకం, ధాన్యం కొనుగోలు మొదలైనవి వర్తిస్తాయని వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు శిరీష, లావణ్య పాల్గొన్నారు.

మండల్ ప్రతిపాదనలకు కుల గణనే కీలకం

మంగళగిరి: ఓబీసీల పితామహుడు బీపీ మండల్ సిఫార్సులు అమలు పరచాలన్నా కులగణనే కీలకమని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో 3,743 కులాలుగా 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రెండు మూడు సిఫార్సులు తప్ప నివేదిక సమర్పించి మూడు దశాబ్దాలైనా మండల్ సిఫార్సులను అమలు జరపడం లేదన్నారు. దేశంలోని వెనుకబడిన తరగతులన్నిటికీ సామాజిక న్యాయం జరిపి జనాభా దామాషా ప్రకారం జీవన రంగాలలో సమన్యాయం జరిగేలా రిజర్వేషన్లు ఉండాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గురుకులంలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు

తాడికొండ: తాడికొండలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలురు గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5, 6, 7 తరగతుల్లో మిగిలిన సీట్లకు ప్రవేశం నిమిత్తం అర్హులైన ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.మరియదాసు శనివారం ఒక ప్రటకనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 27వ తేదీ సాయంత్రం లోగా అందజేయాలని సూచించారు. వివరాలకు 8106695085 నంబరులో సంప్రదించాలని కోరారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి



ఫిరంగిపురం: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో 28 ఏళ్ల ఓ యువకుడు మృతి చెంది పడిఉన్నాడు. స్థానికులు సమాచారంతో ఘటనా స్థలానికి చేరిన పోలీసులు విచారించారు. కాగా ఆ యువకుడు గురించిన వివరాలు తెలియక పోవడంతో మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు.

శివారు ప్రాంతాలకు తాగునీటి సరఫరా

నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగర శివారు ప్రాంతాల ప్రజలకు తాగునీటి సరఫరా చేసేలా నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం స్వర్ణభారతి నగర్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం పనులను కమిషనర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకి సంబంధించి ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. రిజర్వాయర్ పరిధిలో తాగునీటి సరఫరా బాధ్యత ఏఈలదేనన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, డీఈఈ హనీఫ్, ఏఈ అనూష, శానిటరీ సూపర్‌వైజర్ సోమశేఖర్, ఇన్‌స్పెక్టర్ డేవిడ్, ఆర్‌ఐ శ్యామ్ పాల్గొన్నారు.

సురక్షిత సమాజమే పోలీసుల లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

ఫిరంగిపురం: సురక్షిత సమాజమే పోలీసుల లక్ష్యం అని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కొండమెట్ల బజారు రామాలయం వద్ద వారధి కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈసందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు మిత్రుడేకాని శత్రువుకాదన్నారు. ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండి వారి కష్టాలు తీర్చేలా ఉంటారని చెప్పారు. పోలీసు స్టేషన్ ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు వారధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోలీసులను చూసి భయపడాల్సిన పనిలేదని పేర్కొన్నారు. సమాజంలో ఎక్కువగా మొబైల్ వాడు తున్నారని అది ఒక్కోసారి ప్రమాదాలకు దారితీసేలా ఉందని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలు పాఠశాలలు, కాలేజీలకు వెళ్తున్నా వారు ఏమి చేస్తున్నారో గమనించాలన్నారు. సైబర్ నేరాలు జరుగుతున్నాయని ఎవరైనా మీ మొబైల్‌కు ఓటీపీ నంబర్ వచ్చిందని చెప్పాలంటూ కాల్ చేసినా చెప్పవద్దని వివరించారు. ఏ కుటుంబమైనా ఇతర ప్రాంతాలకు వెళ్తే తమ డబ్బు, బంగారం బ్యాంకు లాకర్‌లో పెట్టుకొని వెళ్లేలా చూడాలన్నారు. తాళం వేసినప్పుడు ఊరికెళ్తే సంగతిని ఇంటి చుట్టుపక్కల వారికి గమనించమని చెప్పి తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. అదే విధంగా ఆడపిల్లలపై లైంగిక దాడు జరుగుతున్నాయని వాటిని అరికట్టే దిశగా కృషి చేస్తామని తెలిపారు. తమ పిల్లలు మొబైల్‌లో అపరిచితులతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాంలో పూర్తి సమాచారం తెలియజేయకుండా చూడాలన్నారు. అనంతరం ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాత్రిసమయాల్లో పోలీసు పెట్రోలింగ్ ఉండేలా చూడాలని, మైనర్లు వాహనాలు నడపకుండా కట్టడి చేయాలని, డివైడర్లతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారంటూ ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్లు ఎస్పీ సతీష్‌కుమార్ పంచిపెట్టారు. కార్యక్రమంలో సీఐ వీరేంద్రబాబు, ఎస్ఐ సదాశివరావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, రైటర్ దాసు, పోలీసులు, మహిళాపోలీసు సిబ్బంది. నాయకులు మండవ. నరసింహారావు, కె.రాము, వై.ప్రకాష్, కె.ఏడుకొండలు, ఎస్.రవి పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా గ్రామ సభలు

మాజీ మంత్రి మేకతోటి సుచరిత



తాడికొండ: కూటమి ప్రభుత్వం తూతూమంత్రంగా గ్రామ సభలు నిర్వహించి, గ్రామ సభలు గురించి గొప్పలు చెప్పుకుంటున్నారని, మాజీ మంత్రి మేకతోటి సుచరిత విమర్శించారు. కొన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ సర్పంచులను ప్రొటోకాల్ ప్రకారం పిలువలేదన్నారు. కూటమి నాయకులు గ్రామ పంచాయతీ కార్యదర్శులు మేము చెప్పినట్లు వినాలి, లేదంటే ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసి బదిలీ చేయిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తాడికొండ మండలంలో ఒక గ్రామ సర్పంచిని రాజీనామ చేయాలని కూటమి నాయకులు పట్టుబట్టారని, కొన్ని గ్రామాలలో అధికారుల ముందే సర్పంచి, వార్డు సభ్యులు, కార్యదర్శి లేకుండా టీడీపీ గ్రామ అధ్యక్షుడు ప్రసంగించటంతో అధికారులు ఆశ్చర్యపోయారన్నారు. గ్రామ ప్రజల నుంచి సరైన స్పందన లేక పోవటంతో సభలను తూతూ మంత్రంగా నిర్వహించారన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



మంగళగిరిలో కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

మంగళగిరి: పట్టణంలోని టిప్పర్లబజార్‌లోని నారాయణ టెక్నో స్కూలులో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం కృష్ణాష్టమి సందర్భంగా శనివారం కృష్ణాష్టమి నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు వేషాధారణలో ఆకట్టుకున్నారు.

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం ఎంపీపీ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడి, గోపిక వేషధారణలతో అలరించారు. శ్రీకృష్ణుని చరిత్రను పాఠశాల హెచ్ఎం దివి. కమల్‌మోహన్ వివరించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యకమిటీ చైర్మన్ జె. సుబ్బయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొనుగుపాడులో..

గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు శ్రీకృష్ణుని వేషధారణలు వేసి వారిచే ఆటలు ఆడించారు. ఉట్టి కొట్టించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్ల సాధనకు బీపీ మండల్ కృషి

ఏఎన్‌యూ: మహాత్మా జ్యోతిరావ్ పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం బీపీ మండల్ జయంతి శనివారం నిర్వహించారు. తొలుత బీపీ మండల్ చిత్రపటానికి రెక్టార్ కె.రత్నషీలా మణి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. స్వరూపరాణి, మహాత్మా జ్యోతిరావ్ పూలే అధ్యయన కేంద్రం సంచాలకులు ఎం.త్రిమూర్తి రావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సమావేశానికి మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం సంచాలకులు ఎం.త్రిమూర్తి రావు అధ్యక్షత వహించారు. రెక్టార్ రత్నషీలామణి మాట్లాడుతూ బి.పి. మండల్ బీసీల అభ్యున్నతి కోసం ఎంతగానో పాటుపడ్డారని రిజర్వేషన్లలో 27 శాతం బీసీలకు దక్కేటట్లు చేసిన ఘనత ఆయనదేనని చెప్పారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూపరాణి మాట్లాడుతూ బీసీలు రిజర్వేషన్ల ఫలాలు పొందుతున్నారంటే ఆ గొప్పతనం బి.పి. మండల్‌కే దక్కుతోందని పేర్కొన్నారు. సమావేశంలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు, అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్, గాంధీ అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు వై.అశోక్ కుమార్, పీజే రత్నాకర్, డాక్టర్ కె.సోమ శేఖర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ దివ్యతేజోమూర్తి, డాక్టర్ సూర్య కామేశ్వరి, డీఈలు వెంకటేశ్వరావు, సుబ్బారావు, నాన్ టీచింగ్ బీసీ ఉద్యోగ సంఘ నాయకులు సాంబశివరావు, సాయిరాం, ప్రసాద్, శ్రీనివాస్, డిల్లేశ్వరరావు, కె.వి.సుబ్బారావు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నితీష్ యాదవ్ పాల్గొన్నారు.



బీపీ మండల్, పూలే చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న రత్నషీలా మణి

అలరించిన శ్రీకృష్ణ సంకీర్తన గానలహరి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం భక్త నారద గానసభ నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదిన సందర్భంగా డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య, శ్రీకృష్ణ సంకీర్తన గానలహరి చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఆకురాతి కోదండ రామయ్య తమ గాత్రధారణలో శుక్లాం భరధరం విష్ణుంతో ప్రారంభించగా, రాధాసమేత కృష్ణ, సతు లాల చూడరే, ముద్దుగారే యశోద, పాహి పాహి మోహన కృష్ణ, కృష్ణ కలయ సఖి సుందరం, అని ఆనతించే కృష్ణుడు అర్జున అంటూ పలు శ్రీకృష్ణ సంకీర్తనలు ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. వయోలిన్‌పై పాలపర్తి ఆంజనేయశాస్త్రి, తబలపై చిట్టిబాబు వాయిద్య సహకారం అందించారు.

మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలకు ఖండన

తాడేపల్లిరూరల్: మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు తగదని, ఇస్లాం అంటే శాంతికి చిహ్నం అని, ముస్లిం మనోభావాలను గాయపరుస్తు మహమ్మద్ ప్రవక్తపై రామ్‌గిరి బాబా చేసిన అనుచిత వ్యాఖ్యలను భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకులు షేక్ సుభాని ఖండించారు. శనివారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కులమతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఆయా వర్గాల మనోభావాలను కించపరిచే అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసేవారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



తాడికొండ: తాడికొండలోని సత్యసాయి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో గతంలో కంటి పరీక్షలు నిర్వహించిన 73 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 38 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వీరిలో 26 మందికి శుక్లాల శస్త్రచికిత్సల అవసరమని గుర్తించి సిఫార్సు చేశారు. నేడు వీరిని ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయడం జరుగుతోందని నిర్వాహకులు బండ్ల కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, కమిటీ నాయకులు హరిబాబు, రఫీ, రాజేష్, మోహన్‌రెడ్డి, రమేష్, పెద్దబ్బాయి, నాగేశ్వరరావు, రామారావు, పాల్గొన్నారు.

కార్పొరేషన్ పరిధిలో నాకా బందీ



మంగళగిరి: నగరపాలక సంస్థ పరిధిలో శుక్రవారం రాత్రి పోలీసులు నాకా బందీ చేపట్టారు. నగరంలోని ప్రతి కూడలిలో వాహనాలు తనిఖీలు చేశారు. అనుమానాస్పందంగా ఉన్న వాహనాలు, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. తెల్లవారుజాము వరకు తనిఖీలు నిర్వహించారు. నగరంలోని కాజ టోల్‌గేట్, ఎన్ఆర్ఐ జంక్షన్, పాతబస్టాండ్ సెంటర్, కొత్తబస్టాండ్ సెంటర్, ఆర్ఎండీబీ బంగ్లా, నులకపేట, ప్రకాష్‌నగర్, డొల్లాస్‌నగర్, ప్రకాశం బ్యారేజీ, వారధి, వడ్డేశ్వరం సెంటర్, ఆత్మకూరు నిర్మల కళాశాల సెంటర్ల వద్ద తనిఖీలు నిర్వహించారు. వాహన తనిఖీలలో పట్టణ, రూరల్ సీఐలు వై.శ్రీనివాసరావు, మహేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు.

పూడికతీత పనులు వేగవంతం చేయాలి



మంగళగిరి: నగరంలో చేపట్టిన పూడిక తీత పనులు వేగవంతంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ ఎస్కే అలీంబాషా తెలిపారు. శనివారం నగర పరిధిలోని ఆత్మకూరు తాగునీటి పథకం వద్ద చేపట్టిన పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాలలో పూడిక తీత పనులు జరుగుతున్నాయని చెప్పారు.

కృష్ణాకెనాల్ రైల్వే గేట్ వద్ద గుర్తు తెలియని మృతదేహం



తాడేపల్లి రూరల్: కృష్ణాకెనాల్ రైల్వే గేట్ సమీపంలో శనివారం మధ్యాహ్నం ఒక గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. రైల్వే జీఆర్పీ సీఐ అంజిబాబు తెలిపిన వివరాలు.. కృష్ణాకెనాల్ రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. రైలు నుంచి జారీ పడినట్లు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాక పోవడంతో గుర్తు తెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసి ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. మృతుడు బిస్కెట్ కలర్ ప్యాంటు, లైట్ స్కై బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్ ధరించి ఉన్నట్లు వివరించారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు 9440627546, 9550523485 నెంబరులలో సంప్రదించాలని కోరారు.

పొగాకు ఉత్పత్తులు క్యాన్సర్‌కు కారకం



వడ్డేశ్వరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కేఎల్‌యూ ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు

తాడేపల్లిరూరల్: పొగాకు ఉత్పత్తులు వినియోగించడం వలన క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని కేఎల్‌యూ మేనేజ్‌మెంట్ హ్యూమానిటీ సైన్స్(ఎంహెచ్ఎస్) డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం యూనివర్సిటీ ఎంబీఏ విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీని వడ్డేశ్వరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా చుట్ట, బీడీ, సిగరెట్, పాన్‌పరాగ్, ఖైనీ వంటి పొగాకు ఉత్పత్తులకు బానిసలు అయ్యాని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని వినియోగించడం వలన నోరు, గొంతు, ఊపిరి తిత్తులు తదితర అవయవాలకు క్యాన్సర్ సోకి అర్థాంతరంగా జీవితాన్ని ముగించాల్సి వస్తోందన్నారు. కేఎల్‌యూ బిజినెస్ స్కూల్ ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.హేమదివ్య మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు ప్రాణాంతకం, పొగాకు బానిసలు కాకుండా యువత తమ జీవితాన్ని కాపాడుకోవాలని అన్నారు. అనంతరం పొగాకు వద్దు అంటూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామ ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంబీఏ ఉప విభాగాధిపతి డాక్టర్ బాజాలీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కేవీపీ రాజు, అధ్యాపకులు డాక్టర్ శ్యామ్ సుందర్ త్రిపతి, డాక్టర్ సాయికిరణ్ పాల్గొన్నారు.

ఆయుర్వేదానికి పెరిగిన ప్రాధాన్యం

ప్రొఫెసర్ కూరపాటి శ్రీనివాస్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

తాడేపల్లిరూరల్: ఆరోగ్యమే మహాభాగ్యమని విజయవాడ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కూరపాటి శ్రీనివాస్ అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో భారతీయ జ్ఞాన పరంపరను ప్రోత్సహించడంలో భాగంగా కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగం, ఆంధ్రప్రదేశ్ విజ్ఞాన భారతి సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూరపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయుర్వేదం అనేది భారతీయ ప్రాచీన వైద్యవిధానమని అన్నారు. క్రీ.శ. 2వ శతాబ్దంలో ప్రారంభమైన ఆయుర్వేదం చికిత్స ద్వారా ఎంత మొండి రోగాలకైనా సులువుగా చికిత్స చేయవచ్చని అన్నారు. ఆయుర్వేదం పట్ల సమాజంలో ఉన్న అపోహలు నిజం కాదన్నారు. ఆహార నియమాలు సరిగా పాటిస్తే సగం రోగాలు నయం చేయవచ్చని అన్నారు. సదస్సు కన్వీనర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మారుతున్న జీవన విధానం పుణ్యమా అని చిన్న వయసులోనే పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో చాన్సలర్లు డాక్టర్ కె.ఎస్.జగన్నాథరావు, ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

పత్తి పంటను పరిశీలించిన లాం ఫాం శాస్త్రవేత్తలు



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తాడికొండ: తాడికొండ మండలం లాం గ్రామంలో రైతు అలవల కోటేశ్వరరావు సాగు చేస్తున్న పత్తి పంటను లాం ఫాం శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. ప్రధాన పంట తో పాటు కంది, చుట్టూ సజ్జ అంతర్ పంటగా బెండ అలసంద, చెట్టు చిక్కుడు, గోరు చిక్కుడు పంటలను కొంత భాగంలో గమనించారు. గులాబీ రంగు పురుగు ఉనికి లేకపోవటం, పత్తి పంట ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించారు. రైతు పాటించిన పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. పొలంలో పసుపు రంగు అట్టలు, లింగాకర్షక బుట్టలలో పురుగుల ఉనికి పరిశీలించారు. ఏడీఆర్ దుర్గాప్రసాద్, ఇతర శాస్త్రవేత్తలు పరిశీలించారు. డీపీఏ నున్నా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రైతు అలవల కోటేశ్వరరావు పత్తిని ఏ గ్రేడ్ మోడల్ పంటగా గుర్తించినట్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెల్లడించారు. సాగులో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇది రైతులకు, పర్యావరణ ప్రయోజనానికి ఎంతో మంచిదని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డీపీఎం రాజకుమారి పాల్గొన్నారు.

ఐరన్ పోలిక్‌తో రక్తహీనత దూరం



పరిశీలిస్తున్న డాక్టర్ శ్రావణ్‌బాబు

ఫిరంగిపురం: రక్తహీనత ఉన్న పిల్లలు ఐరన్ పోలిక్ యాసిడ్ బిల్లలు వేసుకున్నట్లయితే రక్తశాతం పెరుగుతుందని ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. వీక్లీ ఐరన్‌పోలిక్ యాసిడ్ సప్లిమెంటర్ ప్రోగ్రాంలో భాగంగా మండంలోని గరుడాచలపాలెం, తక్కెళ్లపాడు, శిరంగిపాలెం గ్రామాల్లో పాఠశాలల్లో విద్యార్థులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎనీమియా ఉన్న వారికి ప్రతి రోజు ఉదయం ఒకటి, సాయంత్రం ఒకటి ఐరన్ మాత్రలు మింగించాలని చెప్పారు. లేకుంటే వారానికి ఒక మాత్ర మింగించాలన్నారు. మూడు నెలల తరువాత రక్తహీనత ఉన్నవారిని పరీక్షించాలన్నారు. వీటితో పాటు పాఠశాలల్లో చిక్కీలు, రాగిజావ, ఆకుకూరలు అందిస్తుండటంతో ప్రస్తుతం విద్యార్థులు రక్తహీనతకు దూరంగా ఉన్నారన్నారు. అనంతరం స్టాకు రిజిస్ట్రార్లు పరిశీలించారు. ఆయన వెంట సీహెచ్ఓ వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ, బృంద చర్చ అంశాల్లో జిల్లాస్థాయి వార్షిక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థి బృందాల్లో దుగ్గిరాల జెడ్పీ ఉన్నత పాఠశాల టీంను వ్యాసరచన, తెనాలిలోని ఎస్‌డీఐ మున్సిపల్ ఉన్నత పాఠశాల బృందాన్ని బృంద చర్చలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పర్యవేక్షణలో జరిగిన పోటీలకు ఉపాధ్యాయులు మంగారావు, నాగార్జున, పాప, వసుంధరా దేవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.